# సర్వదేవతా స్వరూపుడు వినాయకుడు

నిద్దురనుండి లేచి మరి నిద్దుర పోయెడు దాక పొట్టకై
హద్దునుపద్దులేక వ్యయమందగ చేయుచు జీవితంబు నీ
విద్దెల ధారపోసి అరవిందదళాక్షుని విస్మరించి ఏ
పెద్ద సుఖంబు నొందితివొ ప్రీతిగ యోచన చేయు మానవా!

ప్రేమస్వరూపులారా! మానవ జీవితం ఉత్కృష్టమైనది, సౌజన్యమైనది, సౌశీల్యమైనది. ఇట్టి మానవత్వాన్ని నిత్యకృషిద్వారా, సత్కర్మలద్వారా సార్థకం గావించుకోవటం మానవుని ప్రధాన కర్తవ్యం.

జేనెడు పొట్ట నింపుకొన చిక్కుల నొందుచు కోటివిద్యలన్
పూనిక మీర నేర్చి పరిపూర్ణ సుఖంబును పొందలేక ఈ
మానవజాతి దుఃఖముల మ్రగ్గగనేటికి? శ్రీపరాత్పరున్
ధ్యానము చేయు భక్తులకు దారిని చూపకయున్నె మానవా!

ప్రేమస్వరూపులారా! జేనెడు పొట్టను నింపుకొనుటకై మీరు అనేక శ్రమలు పడుతున్నారు, అనేకవిధములుగా ధనము నార్జిస్తున్నారు. కాని అంతటితో తృప్తిపడుతున్నారా? లేదు. సుఖశాంతుల ననుభవిస్తున్నారా? లేదు. "న సుఖాత్ లభ్యతే సుఖం." సుఖమునుండి సుఖం లభించదు, కష్టమునుండియే సుఖం లభిస్తుంది. మీరు సుఖము నాశిస్తున్నారేగాని, కష్టపడటానికి ఏమాత్రం సిద్ధంగా లేరు. సుఖశాంతులు కావలెనన్న కష్టములను అనుభవించక తప్పదు. ముఖ్యంగా మీరు త్యాగభావమును పోషించుకోవాలి.

బ్రతికినన్నినాళ్ళు ఫలమిచ్చుటేకాదు
చచ్చికూడ చీల్చి ఇచ్చు తనువు
త్యాగభావమునకు తరువులే గురువులు
ఉన్నమాట తెలుపుచున్న మాట

sri sathyasai vachanamrutam

మానవునికి త్యాగభావం అత్యవసరం. ఈ విషయంలో వృక్షములను ఆదర్శంగా తీసుకోవాలి. త్యాగం లేక ఆనందం లభించదు.

ఈనాటి మానవులు తమ తప్పులను కప్పిపుచ్చుకోవటానికి ప్రయత్నిస్తున్నారేగాని, చేసిన తప్పులకు పశ్చాత్తాపపడి తమను తాము సరిదిద్దుకోవటానికి ప్రయత్నించటం లేదు. ప్రాచీన ఋషులు చాలా ఉత్తములు. ఒకవేళ తమద్వారా ఏదైనా తప్పు జరిగితే దానికి తగిన శిక్షను అనుభవించి, హృదయపూర్వకంగా పశ్చాత్తాపపడి, దైవాన్ని క్షమాపణ కోరుకునేవారు. వారే త్యాగులు, యోగులు. కాని చేసిన తప్పుకు పశ్చాత్తాపపడనివారు, క్షమాపణ కోరనివారు ఈనాటి భోగులు. ఈ భోగులకు రోగమే తప్ప యోగము చేకూరదు. చేసిన తప్పుకు హృదయపూర్వకంగా పశ్చాత్తాపపడి, దైవాన్ని క్షమాపణ కోరాలి. కేవలం మాటలతో, వ్రాతలతో కోరితే సరిపోదు. అవన్నీ బాహ్యమైన, నిరుపయోగమైన ప్రదర్శనలు. హృదయపూర్వకంగా పరితపించాలి, ప్రార్థించాలి.

భగవంతుడు ప్రేమస్వరూపుడు, దయామయుడు. అయితే, ఒక్కొక్కసారి భగవంతుడు తనకు దయలేనట్లుగా నటిస్తాడుగాని, నిజంగా దయ లేకపోలేదు. అయితే, ఆ దయను అర్థం చేసుకునే 'కెపాసిటీ'ని మీరు సంపాదించుకోవాలి. దయను దయతోనే అర్థం చేసుకోవటానికి వీలౌతుంది, ప్రేమను ప్రేమతోనే చూడటానికి సాధ్యమౌతుంది. కనుక మీలో దయ, ప్రేమలున్నప్పుడే భగవంతుని దయ, ప్రేమలు మీకు అర్థమౌతాయి.

**ఏనుగుతల, ఎలుకవాహనం - అంతరార్థం**

మానవుడు తన దోషాలను పరిహారం గావించుకొని, దైవానికి కృతజ్ఞతాపూర్వకమైన వందనము లర్పించాలి. దీనిని పురస్కరించుకొనియే విఘ్నేశ్వర పూజ ప్రారంభమయింది. విఘ్నేశ్వరుడనగా ఎవరు? గణపతి అనగా ఎవరు? 'గ' అనేది బుద్ధికి సంబంధించినది. కనుక, బుద్ధికి, విజ్ఞానమునకు అధిపతి గణపతి. సర్వకర్మలను నిర్విఘ్నంగా నెరవేర్చేవాడు విఘ్నేశ్వరుడు. ఇతడు మూషిక వాహనుడు. దీని అంతర్థామేమిటి? మూషికము చీకటికి చిహ్నం. ఎందుకంటే, ఎలుకలు రాత్రివేళలందు అధికంగా సంచరిస్తుంటాయి. వినాయకుడు ఎలుకను తన క్రింద పెట్టుకున్నాడు. అనగా, అజ్ఞానాంధకారమును అణగద్రొక్కి, ప్రజ్ఞానమును

ప్రకాశింపజేసి, జనులకు ఆనందమును, ఆదర్శమును అందిస్తాడు మూషికవాహనుడు. ఇతని ఏనుగుతల, ఎలుకవాహనములు దైవత్వం కేవలం మానవులందేగాక జంతుజాలములందు కూడా ఉన్నదనే సత్యాన్ని నిరూపిస్తున్నాయి. అంతేగాక, ఏనుగుతల తెలివితేటలకు చిహ్నం. ఏనుగు చాలా తెలివైనది. కనుకనే, 'గజతెలివి' అనే పదం వాడుకలోకి వచ్చింది. ఎట్టి పరిస్థితిలోనైనా గజము తన యజమానిని మరువదు. తుదిశ్వాస వదిలేంతవరకు తన యజమానిపట్ల కృతజ్ఞత చూపుతుంది; ప్రాణాలకైనా తెగించి యజమానిని కాపాడుతుంది. గజములో క్షమాగుణంకూడా మెండుగా ఉంటుంది.

> క్షమ సత్యము, క్షమ ధర్మము
> క్షమ వేదము, క్షమ అహింస, క్షమ యజ్ఞంబౌ
> క్షమ సంతోషము, క్షమ స్వర్గము
> క్షమ సర్వస్వము సర్వలోకములన్

నడవడానికి దారి లేని కీకారణ్యంలో ఒక్కసారి ఏనుగు ప్రవేశించిందంటే మనుష్యులకు దారి ఏర్పడుతుంది. అదేరీతిగా, గజముఖుని ముందు పెట్టుకుంటే జీవితారణ్యాన్ని సులభంగా దాటవచ్చు.

**కుడుములు, ఉండ్రాళ్ళు – అంతరార్థం**

ఈ వినాయకచవితినాడు మనం వినాయకునికి కుడుములు, ఉండ్రాళ్ళను నైవేద్యం పెడుతున్నాము. నూనెతోకూడిన పదార్థములను వినాయకుడు ఆరగించడు. నూనె లేకుండా కేవలం ఆవిరిపై ఉడికిన పదార్థములను మాత్రమే స్వీకరిస్తాడు. బియ్యపుపిండిని ఉడికించి, అందులో బెల్లం, నువ్వులపిండి పెట్టి కుడుములు, ఉండ్రాళ్ళు తయారు చేసి వినాయకునికి నైవేద్యం పెట్టటంలో గల అంతరార్థమేమిటి? నూనె లేకుండా ఆవిరితో ఉడికించిన పదార్థములను భుజించేవారు పూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారు. ఆరోగ్యమే మహాభాగ్యం. కాని, ఈనాటి మానవుడు జిహ్వాచాపల్యం చేత అనేకవిధములైన రుచులకు మరిగి ఆరోగ్యమును తన చేతులారా పాడు చేసుకుంటున్నాడు. ఆవిరిపై ఉడికిన పదార్థములు త్వరగా జీర్ణమౌతాయి. ఆవిరిపై ఉడికిన బియ్యపు పిండిలో నువ్వులను కలిపి భుజించటంచేత కంటిజబ్బులు నివారణ అవుతాయి.

sri sathyasai vahini vachanamrutam

నువ్వులు, బెల్లము వాత, పిత్త, శ్లేష్మాదులకు సంబంధించిన రోగాలను దగ్గరకు రానీయవు.

ఈనాటి మానవుడు వినాయకుణ్ణి పూజించటం నేర్చుకున్నాడుగాని, ఆ పూజలో ఉన్న అంతరార్థము నేమాత్రం గుర్తించటం లేదు. వినాయకపూజ మానవునికి ఎంతో ఆనందమును, ఆరోగ్యమును, ఆదర్శమును అందిస్తుంది; తెలివి తేటలను పోషిస్తుంది; జ్ఞాపకశక్తిని పెంచుతుంది. కనుకనే ఈరోజున విద్యార్థులు వినాయకుణ్ణి అధికంగా పూజిస్తుంటారు. ఇంతేగాక, సంగీత విద్వాంసులు తమ కార్యక్రమాన్ని వినాయక ప్రార్థనతోనే ప్రారంభిస్తారు. వినాయకుణ్ణి విస్మరిస్తే వినాశనం తప్పదు.

ఈనాటి మానవుడు కేవలం తాత్కాలికమైన సుఖసంతోషములకోసం ప్రాకులాడుతున్నాడుగాని, శాశ్వతానందమును పొందటానికి కృషి చేయటం లేదు. శాశ్వత సుఖశాంతులు ఒక్క దైవప్రార్థనచేత తప్ప అన్యమార్గంలో లభించవు.

**వినాయకుడు మీయందే ఉన్నాడు**

ప్రేమస్వరూపులారా! మీ హృదయమందే ఉన్నాడు బొజ్జవినాయకుడు. అట్టి వినాయక తత్త్వాన్ని మీరు మొట్టమొదట గుర్తించాలి. వినాయకుణ్ణి నిరంతరం స్మరించాలి. దేవతలందరూ వినాయకుణ్ణి పూజిస్తారు. శైవులు, వైష్ణవులుకూడా వినాయకుణ్ణి పూజిస్తారు. సర్వదేవతాస్వరూపుడు వినాయకుడు. సర్వమతసారస్వరూపుడు వినాయకుడు. ఈ సత్యాన్ని గుర్తించి వర్తించినప్పుడే మీరు ధన్యులౌతారు. ఈనాడు వినాయక చవితి, వినాయకుడనగా నాయకుడు లేనివాడు. ఎవరికైనా నాయకుడుంటాడుగాని, వినాయకునికి మాత్రం నాయకుడు లేడు. సర్వమునకు అతడే 'లీడర్' (నాయకుడు). అలాంటి 'లీడర్'ను మీరు అనుసరించాలి. 'లీడర్' మంచివాడైనప్పుడు గమ్యంకూడా మంచిదిగానే ఉంటుంది. కాని ఈనాటి లీడర్లు సరియైనరీతిగా లేరు. అసలు ఎవరు మీ నిజమైన లీడరు? మీ 'కాన్షియన్సే' (అంతరాత్మ) మీ లీడరు. ఈనాడు మీరు మీ మనస్సును దుర్బుద్ధులతో, దురభ్యాసములతో, దుర్వాసనలతో మాలిన్యపరచుకుంటున్నారు. వాసనలను అణగద్రొక్కువాడు వినాయకుడు. ఎలుక ఎప్పుడూ వాసన చూస్తూ పోతుంటుంది. వినాయకుడు వాసనలను అణగద్రొక్కువాడు కనుకనే, ఎలుకను తన క్రింద పెట్టుకున్నాడు. అనగా ఎలుకను తన వాహనంగా చేసుకున్నాడు. అట్టి

sri sathyasai vahini amrutam

మూషికవాహనుని మునిజనులందరూ పూజిస్తూవచ్చారు. వినాయకపూజ ఏదో కొద్దికాలం క్రిందటే ప్రారంభమయిందని చాలామంది భావిస్తున్నారు. ఇది చాలా పొరపాటు వినాయక పూజ ప్రాచీనమైనదేగాని, నవీనమైనది కాదు. నారాయణోపనిషత్తులోకూడా వినాయక ప్రార్థన ఉంది;

> తత్పురుషాయ విద్మహే వక్రతుండాయ ధీమహి
> తన్నో దంతిః ప్రచోదయాత్"

ఋగ్వేద, యజుర్వేద, సామవేదములందు వినాయక పూజకు సంబంధించిన మంత్రములున్నాయి. అన్ని పర్వదినములకంటే వినాయక చవితి పండుగయే మొట్టమొదట వస్తుంది. తరువాతనే మిగిలిన పండుగలు వస్తాయి. గృహప్రవేశమునకుగాని, విద్యాభ్యాసమునకుగాని, నిర్మాణములకుగాని... ఏ పని ప్రారంభించటానికైనా ముందు వినాయకుణ్ణి ప్రార్థించాలి. సిద్ధికి, బుద్ధికి అతనే నాయకుడు. కనుకనే సిద్ధి, బుద్ధులను అతని పత్నులుగా భావించారు. సిద్ధి కావాలంటే బుద్ధి ఉండాలి. బుద్ధి ఉండాలంటే కృతజ్ఞతను కలిగియుండాలి. కృతజ్ఞత లేనివానికి బుద్ధి నాశనమౌతుంది. బుద్ధి నాశనమైన తరువాత సిద్ధి కల్గటం అసాధ్యం. "అల్పబుద్ధి నెంత ఆదరించినగాని కడకు కీడు చేయు ఘనునికైన". అట్టి అల్పులు కాకూడదు మీరు, అధికులు కావాలి.

ఇతరుల నుండి మీరు పొందిన ఉపకారమును జీవితాంతం మనస్సులో పెట్టుకొని వారికి తగిన కృతజ్ఞత చూపించాలి. కృతజ్ఞత లేనివాడు క్రూరమృగంతో సమానం. కృతజ్ఞత చూపనివాడు తన కన్నులను తానే పొడుచుకున్నవాడౌతాడు. సూర్యనమస్కారాలు చేసేటప్పుడు మీరు "కృతఘ్నఘ్నాయనమః" అని అంటారు కదా! దీని అర్థమేమిటి? ఆదిత్యునివల్లనే మన కన్నులు చూడగల్గుతున్నవి. ఆదిత్యుని ప్రతిబింబమే మన నేత్రములందున్నది. కృతజ్ఞత లేనివాని నేత్రములనుండి ఆదిత్యుడు వైదొలగుతాడు. అనగా కృతఘ్నునికి అంధత్వం ప్రాప్తిస్తుంది.

**శరీరము - మనస్సు - ఆత్మ**

శారీరక, మానసిక, ఆధ్యాత్మిక బలములను చేకూర్చేవాడు వినాయకుడు. మా కాలేజిలో MBA కోర్సు ఉన్నది. MBA అంటే ఏమిటని అడిగితే పిల్లలు Master of Business

srisathyasai vahini vachanamrutam

Administration అంటారు. ఇంతమాత్రమే కాదు. M అనగా Mind (మనస్సు), B అనగా Body (దేహము), A అనగా Atma (ఆత్మ). మనస్సు, దేహము, ఆత్మ – ఈ మూడింటి గురించి తెలియజేయునదే ఈ MBA మనస్సు సంకల్పిస్తుంది, దేహము దానిని ఆచరణలో పెడుతుంది. ఇవి తమ కర్తవ్యాలను నిర్వర్తిస్తున్నాయా, లేదా అని గమనిస్తుంది ఆత్మ. ఆత్మ శాశ్వతమైనది. మనస్సు చంచలమైనది. దానిని సక్రమమైన మార్గంలో ప్రవేశపెట్టాలి. "నేను మానవుడను. నా మనస్సు మానవునికి తగినట్లుగా ఉన్నదా?" అని విచారణ చేయాలి. ఇంక దేహం చేయవలసింది ఏమిటి? మనస్సు నిర్ణయించిన తక్షణమే ఆచరణలో ప్రవేశించకూడదు. బుద్ధిని ఉపయోగించి "మనస్సు నిర్ణయించింది తప్పా, ఒప్పా?" అని విచారణ చేయాలి. మనస్సు నిర్ణయించినది మంచిదైతే ఆచరణలో పెట్టాలి. ప్రతి మానవుడు దేహ మనో, బుద్ధ్యాత్మతత్త్వములను గుర్తించాలి. మొట్టమొదట మనస్సును పరిశుద్ధపరచుకోవాలి. మనస్సు ఇంద్రియాలకు మాస్టర్ (యజమాని). కాని, ఏమి ప్రయోజనం? అది ఇంద్రియాలను కంట్రోల్ చేయటం లేదు. ఇంద్రియాలను కంట్రోల్ చేసేవాడే నిజమైన 'మాస్టర్ మైండ్'. కనుక Master the mind, be a master-mind.

ఇంక, ఆత్మతత్త్వము ఎలాంటిది? అది అన్నింటికీ సాక్షీభూతంగా ఉంటుంది; మనోదేహములు చేసే పనులను చూస్తుందిగాని, తాను వాటితో జోక్యం చేసుకోదు. మనస్సు తనకు సంబంధించిన పని తాను చేస్తోందా? దేహం తనకు సంబంధించిన కర్మలను తాను ఆచరిస్తోందా? అని రెండింటినీ సాక్షీభూతంగా చూస్తుంటుంది.

**వాల్మీకి ప్రశ్నలు – నారదుని సమాధానం**

ఒకానొక సమయంలో వాల్మీకి నారదుణ్ణి "స్వామీ! ఈ ప్రపంచంలో సత్యవాక్పరిపాలకుడున్నాడా? నిరంతరము ఆనందమును అనుభవించే వాడున్నాడా? నిరంతరము చిరునవ్వులు చిందించే మోముగలవాడున్నాడా? తప్పు చేయనివాడున్నాడా? తప్పు చేసినవారిని క్షమించేవాడున్నాడా? పొందిన ఏ చిన్న ఉపకారమునకైనా కృతజ్ఞత చూపే వాడున్నాడా? సత్యధర్మములతో జీవితాన్ని గడిపే వాడున్నాడా?..." అని ఈరీతిగా పదకొండు ప్రశ్నలు అడిగాడు. అప్పుడు నారదుడు "వాల్మీకీ! పదకొండు కాదు, పదకొండు వేల

sri sathyasai vahanamrutam

సద్గుణములకు అధిపతియైన శ్రీరాముడు నరరూపధారియై ఈ జగత్తులోనే ఉన్నాడు. సద్గుణములు, సత్ప్రవర్తనగలవాడే భగవత్స్వరూపుడు. అట్టి శ్రీరామచంద్రుడు మానవాకారంలో పుట్టాడు. తానెన్నో అవస్థలకు గురి అయినాడు. కాని, ఎట్టి పరిస్థితిలోనూ సత్యమార్గమును వీడలేదు. అతడు చెప్పిందంతా సత్యమే, చేసిందంతా ధర్మమే. కనుక, అతనిని నీవు అనుసరించు నాయనా!" అని బోధించాడు. నారదుడు కలహప్రియుడని అనేకమంది అపోహపడుతుంటారు. నారదుడు కలహప్రియుడు కాదు, కఠినహృదయుడు కాదు. అతడు జ్ఞానజ్యోతి ప్రకాశకుడు; విశ్వామిత్రుడు సంపాదించిన గాయత్రీ మంత్రమును లోకానికి అందించినవాడు.

ఓం భూర్భువస్సువః తత్సవితుర్వేరేణ్యం
భర్గో దేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్

'భూః' అనేది దేహమునకు సంబంధించినది. దేహం ప్రాకృతమైనది; సున్నము, సీసము, ఇనుము మొదలైన 'మెటీరియల్స్'తో కూడినది. కాబట్టి దేహం 'మెటీరియలైజేషన్'. 'భువః' అనేది 'వైబ్రేషన్'కు సంబంధించినది. 'వైబ్రేషన్' లేక దేహం ఏ పనీ చేయలేదు. 'వైబ్రేషన్'ను అందించేది మనస్సు. ఇంక 'సువః' అనగా ఆత్మతత్త్వం. అదియే 'రేడియేషన్'. "భూర్భువస్సువః" – ఈ మూడింటితత్త్వంతో కూడినవాడు మానవుడు.

**డివైన్ వైబ్రేషన్ సర్వత్రా నిండియున్నది**

ప్రతి రోజూ ఇక్కడ ఉదయం, సాయంకాలం భజన జరుగుతోంది. భజన ఎక్కడ జరుగుతున్నదని అడిగితే, హాలులో జరుగుతున్నదని మీరంటారు. అయితే ఈ టేబుల్ పైనకూడా ఆ భజనయొక్క 'వైబ్రేషన్' ఉంటున్నది. మీరు చక్కగా చెవులు పెట్టివింటే, ఈ టేబుల్కూడా భజన పాడుతున్నదని గుర్తించవచ్చు. కాబట్టి, భజన అనేది కేవలం ఈ హాలుకు మాత్రమే పరిమితమైనది కాదు. దాని 'వైబ్రేషన్' సర్వత్రా వ్యాపిస్తున్నది. సర్వత్రా 'డివైన్ వైబ్రేషన్' నిండియున్నది. ఈ స్తంభములందు, ఈ గోడలందు, ఈ మైకునందు అంతా 'డివైన్ వైబ్రేషనే' నిండియున్నది. మీరు నిశ్చలమైన భావంతో, నిర్మలమైన, నిస్స్వార్థమైన హృదయంతో వింటే అది తప్పక మీకు వినిపిస్తుంది. అట్లు విన్నటువంటివారే ప్రాచీన మహర్షులు. సారస్వతుడు బోధించిన వేదమును వారందరూ 'వైబ్రేషన్' చేతనే గ్రహించారు. సర్వత్రా వ్యాపించిన 'డివైన్

sri sathyasai vahini amrutam

వైబ్రేషన్' మీరు నిర్మలమైన హృదయంతో ఎక్కడ విన్నప్పటికీ మీకు వినిపిస్తుంది. అంతవరకూ పోనక్కర్లేదు, మీరు కూర్చున్నచోటే మీ చెవులు గట్టిగా మూసుకోండి – లోపలినుండి 'ఓం' అనే శబ్దం మీకు వినిపిస్తుంది. "ఓమిత్యేకాక్షరం బ్రహ్మ." అదియే నిజమైన వేదము. అన్నీ ఓంకారమునుండి వచ్చినవే. హార్మోనియంపై మీరు ఒక్కొక్క 'రీడ్'ను వత్తినప్పుడు స, రి, గ, మ, ప, ద, ని, ... అని అది ఒక్కొక్క స్వరమును పలుకుతుంది. ఈ శబ్దములు ఎక్కడినుండి వస్తున్నాయి? ఒకే గాలి నుండియే వస్తున్నాయి కదా! అదేరీతిగా వివిధ శబ్దములన్నీ ఓంకారమునుండియే ఆవిర్భవించినాయి. సర్వత్రా వ్యాపించిన 'డివైన్ వైబ్రేషన్' వినాయకునినుండియే ఆవిర్భవించింది.

**"త్యజ దుర్జన సంసర్గం"**

మన సంకల్పము లెలాంటివో మన దేహంలో అలాంటి 'వైబ్రేషన్' నిండియుంటుంది. కనుక దుష్టసంకల్పములతోకూడినవాని దగ్గరకుకూడా మనం పోకూడదు. ఎందుకంటే, దుష్టులతో సహవాసం చేస్తే వారిలో ఉన్న దుష్టసంకల్పముల 'వైబ్రేషన్' మనలోకూడా ప్రవేశిస్తుంది. కనుకనే

"త్యజ దుర్జన సంసర్గం, భజ సాధు సమాగమం
కురు పుణ్య మహోరాత్రం, స్మర నిత్యమనిత్యతాం"

మనం మంచివారమైనప్పుడు మన దేహమంతా మంచి 'వైబ్రేషన్' నిండియుంటుంది. అది 'డివైన్ వైబ్రేషన్'గా రూపొందుతుంది. కాని, మన భావాలు చెడ్డగా ఉంటే అంతా చెడ్డగానే కనిపిస్తుంది. మీరు చూసేది ప్రతి ఒక్కటీ మీ అంతర్భావంయొక్క ప్రతిబింబమే. మీరు ఎవరినో చూసి 'వీడు చెడ్డవాడు' అంటారు. కాని, అతను నిజంగా చెడ్డవాడు కాదు. మీ చెడ్డతనమే అతనియందు ప్రతిబింబిస్తున్నది. మంచిచెడ్డలు బయట లేవు, మీలోనే ఉన్నాయి. మీలో మంచి భావములున్నప్పుడు అంతా మంచి 'వైబ్రేషనే' వస్తుంది. కాని ఈనాటి విద్యార్థులకు ఈ సత్యమును గుర్తించుటకు తగిన శక్తిసామర్థ్యములు లేవు. వారికి కేవలం గ్రంథపరిచయం మాత్రమే ఉన్నదిగాని, హృదయ పరిచయం ఏమాత్రం లేదు. పుస్తకాల్లో ఉన్నది కంఠస్థం చేసి దాన్ని పరీక్షలో కుమ్మరించి ఖాళీ తలతో బయటికి వస్తారు. పరీక్షలో ఏమి వ్రాశారో బయటికి

sri sathyasai vachanamrutam

వచ్చిన తరువాత వారికే జ్ఞాపకముండదు. ఇటువంటి చదువులవలన ప్రయోజనమేమిటి? జేనెడు పొట్ట నింపుకోవటంకోసం చదివే చదువులే ఇవన్నీ. పొట్టకూటికోసం చదివే చదువు చదువు కాదు. అది మీలో దివ్యత్వాన్ని పోషించదు, మీకు ఆనందమును అందించదు. హృదయానికి సంబంధించిన చదువు చదవాలి.

**మానవదేహం ఒక మురళివంటిది**

ప్రేమస్వరూపులారా! ఈనాడు లోకంలో ఎక్కడ చూసినా వికృతమైన, వినాశకరమైన, విపరీతమైన చేష్టలు గోచరిస్తున్నాయి. ఎక్కడ చూసినా తిట్టుకోవటాలు, కొట్టుకోవటాలు, చంపుకోవటాలు! మానవునిలో మానవత్వం ఎక్కడికి పోయింది? దయాదాక్షిణ్యములు, ప్రేమ, త్యాగములు ఎక్కడికి పోయినాయి? ఎక్కడికి పోయినాయోగాని కంటికి కనిపించటం లేదు. మీరీ జగత్తులో మానవులై పుట్టారు. కనుక మీరు మానవులుగా బ్రతకండి. మానవత్వాన్ని పోషించుకోండి, ఆనందాన్ని అనుభవించండి. అనుభవించిన ఆనందాన్ని తోటి వారికి పంచండి. పవిత్రమైన భావములను పోషించుకున్నప్పుడే మీరు నిజమైన మానవులుగా తయారౌతారు. దయ లేనివాడు దానవుడనే చెప్పవచ్చు. దానవునకు దయ ఉండదు. మీరు మానవులుగా పుట్టినందుకు మీలో దయ ఉండాలి, ప్రేమను పెంచుకోవాలి.

దీనిని పురస్కరించుకొనియే గోపికలు కృష్ణుణ్ణి ఈరీతిగా ప్రార్థించారు; "కృష్ణా! మా హృదయాలు ప్రేమరహితమైన మరుభూములుగా ఉన్నాయి. ప్రేమరహిత మరుభూములలో... ప్రేమాంకురములు పెంపొందగ... ప్రేమావేశముతో... ప్రేమసుధావర్షము వర్షింపగ... ప్రేమనదులు ప్రవహింపగ... మురళీగానము సేయగదే!... కృష్ణా! గానము సేయగదే!" ఇక్కడ మురళి అనగా వెదురుతో చేయబడిన సంగీత పరికరం కాదు. తొమ్మిది చిల్లులతోకూడిన మీ దేహమే ఒక మురళివంటిది. దీనినుండి శ్రావ్యమైన స్వరాలు రావాలి; అపస్వరాలు, అపశ్రుతులు రాకూడదు. కృష్ణుని మధురమైన వేణుగానమును వింటూ రాధ అందులో లీనమైపోయింది. ఎవరీ రాధ? ఆమె సామాన్యమైన స్త్రీ కాదు. 'ధర' (ప్రకృతి)యే రాధగా మారిపోయింది. ప్రకృతియే ఒక స్త్రీ. ఆమెయే రాధ. రాధాకృష్ణులు, సీతారాములు, పార్వతీపరమేశ్వరులు... ఈరీతిగా ప్రకృతి తరువాతనే పరమాత్మను ఉంచుతున్నాము. అనగా ప్రకృతిని మొట్టమొదట

sri sathyasai vachanamrutam

ప్రార్థించాలి. ప్రకృతిలో పవిత్రమైన కర్మలనాచరించాలి. అప్పుడే పరమాత్మ అనుగ్రహం కల్గుతుంది. ఆనందం ప్రాప్తిస్తుంది. పరమాత్మచేత కానిది ఏ ఒక్కటీ లేదు. పరమాత్మ అనుగ్రహంచేత ఏ కార్యమునైనా సాధించవచ్చు. అట్టి పరమాత్మను విస్మరించి ఈనాటి మానవుడు నిరంతరం ప్రకృతినే చింతిస్తున్నాడు. ఇది సరియైనది కాదు.

## స్వామిసన్నిధిలో సేవ చేస్తున్న ఆదర్శమూర్తులు

మన ప్రశాంతినిలయంలో 15, 20 ఏళ్ళనుండి చలించని మనస్సుతో, ఎన్ని కష్టములనైనా లెక్కచేయకుండా స్వామిసేవ చేస్తున్నారు కొందరు. అదియే నిజమైన భక్తికి చిహ్నం. అందువల్లనే వారినీనాడు సన్మానించటం జరిగింది. ఇది సన్మానం కాదు, స్వామిప్రేమయొక్క ప్రతిబింబమే. ఈవిధంగా మున్ముందు ఇంకా ఎంతో జరుగుతుంది. చలించని మనస్సును, భ్రమించిన దృష్టిని పోషించుకోండి. దృఢమైన భక్తివిశ్వాసములతో మీరు చేయవలసిన సేవలు చేయండి.

ఇక్కడ మన ప్రొఫెసర్ రాధాస్వామి ఉన్నాడు. ఆయన రిటైర్ అయి పదేళ్ళు అయింది. ఆయనకు ఇక్కడే సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో బైపాస్ సర్జరీ జరిగింది. "స్వామీ! నాకు జీవితమిచ్చినది మీరు. నాకేదీ అక్కర్లేదు. నేను సేవ చేస్తాను" అన్నాడు. ఇలాంటి పవిత్రమైన హృదయం గలవారు చాలా అరుదుగా ఉంటారు.

ఇక్కడి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లోని కార్డియాలజీ విభాగంలో ఇటలీకి చెందిన ఒక డాక్టరు పని చేస్తున్నాడు. ఆయనకు ఇటలీలో కావలసినంత పని ఉంది. కాని తాను దైవ సన్నిధిలో సేవ చేయాలనే పవిత్ర భావంతో ఇక్కడికి వచ్చేశాడు. కేశవ ప్రసాద్ అనే మరో డాక్టరు అమెరికానుండి వచ్చాడు. ఆయన Young man. అక్కడింకా ఎంత పనైనా చేయవచ్చు. కాని అదంతా వదలిపెట్టి స్వామిసేవ చేయాలని తన సామాన్లు సర్దుకొని ఇక్కడికి వచ్చేశాడు. చూసేవారికి వీరు సామాన్యులుగా కనిపిస్తారు. కాని వీరి శక్తిసామర్థ్యములను లోతుగా విచారణ చేస్తే... వీరికంటే ఘనులు ఎక్కడా లేరు. వీరు చాలా ప్రత్యేకమైనవారు. ఇలాంటివారు ప్రశాంతినిలయంలో చాలా సామాన్యమైన జీవితాన్ని గడుపుతూ, కేవలం స్వామిప్రేమకోసం రాత్రింబవళ్ళు పని చేస్తున్నారు.

sri sathyasai vachanamrutam

నేను 30 సంవత్సరాల క్రిందట బొంబాయికి వెళ్ళినప్పుడు డా॥ అగ్రేజా వచ్చి ఆ జనంలో కూర్చున్నాడు; హఠాత్తుగా 'హార్ట్ ఎటాక్' వచ్చి పడిపోయాడు. నేను తక్షణమే స్టేజి దిగి అతని వద్దకు వెళ్ళి, అతని గుండెపైన చేయిపెట్టి రుద్దాను. స్ట్రెచర్‌లో అతనిని బయటికి తీసుకువెళ్ళారు. అప్పుడు పుట్టపర్తికి వచ్చినవాడు ఇంక తిరిగి వెళ్ళలేదు. ఇక్కడే ఉండి సేవ చేస్తున్నాడు. "నాయనా! నీకు 90 సంవత్సరాలు వచ్చాయి. మెట్లు ఎక్కలేవు, నడవలేవు. కాబట్టి హాస్పిటల్‌కు కారులో వెళ్ళు" అని చెప్పాను. అందుకు ఆయన "స్వామీ! నాకు మీరిచ్చిన దేహమనే కారు భద్రంగా ఉన్నంతవరకు నా పని నేను చేస్తాను. నాకు వేరే కారు అవసరం లేదు" అని చెప్పాడు. ఇప్పటికీ హాస్పిటల్‌కు నడుచుకుంటూనే వెళతాడు.

## దైవచింతన, దైవసేవలు దీర్ఘాయుష్షు నందిస్తాయి

మన ప్రశాంతినిలయంలో పూర్వం శేషగిరిరావు అనే భక్తుడుండేవాడు. ఆయన గొప్ప ఆఫీసరుగా పనిచేశాడు. ఆయనను హారతి ఇచ్చేందుకు నియమించాము. ఆయన 100 సం॥లు గట్టిగా ఉన్నాడు. ఆయన పోయిన తరువాత కిష్టప్ప వచ్చాడు. ఆయన ప్రతి రోజూ నడుచుకుంటూ వచ్చి, హారతి ఇచ్చి, తిరిగి నడుచుకుంటూ వెళ్ళేవాడు. ఆయన కూడా 101 సంవత్సరాలు బ్రతికాడు.

సూరయ్య అనే మరో భక్తుడుండేవాడు. ఆయన వెంకటగిరి మనిషి, బ్రహ్మచారి. ఆరడుగుల మూడు ఇంచిల పొడవుండేవాడు. ఆయన రాత్రి పూట నేను పడుకొనేటప్పుడు నెమ్మదిగా తలుపు తెరచి లోనికి వచ్చి పాదములు వత్తేవాడు. "నా పాదాలకు నొప్పి లేదు సూరయ్యా!" అంటే "స్వామీ! మీకు నొప్పి లేదుగాని, మీ పాదాలను వత్తకపోతే నాకు నొప్పి" అనేవాడు. ఆయనకు శ్రమ కల్గించకూడదని నేను నిద్రపోతున్నట్లు నటించేవాడిని. నేను కన్నులు మూసుకోవటం చూసి ఆయన వెళ్ళిపోయేవాడు. ఆయన 100 సం॥లు జీవించాడు; తన కడపటి రోజువరకు సేవ చేశాడు. కారుణ్యానందకూడా 100 సం॥లు జీవించాడు. కస్తూరి ఎప్పుడో పోవలసినవాడు. కాని, ప్రశాంతినిలయానికి రావటంచేత 90 సం॥లు బ్రతికాడు.

ఇక్కడికి వచ్చి సేవ చేసినవారందరూ దీర్ఘకాలం జీవించారు. కారణమేమిటి? దైవచింతన, దైవసేవలే. అవే దీర్ఘాయుష్షును అందిస్తాయి. ఈ లోకంలో ఎంతోమంది ఎక్సర్‌సైజులు

sri sathyasai vachanamrutam

చేస్తుంటారు, టానిక్కులు త్రాగుతుంటారు. కాని వారు మాత్రం ఎలాంటి మందులూ తీసుకునేవారు కారు. కడుపునొప్పి వస్తే నా దగ్గరికి పరుగెత్తుకొని వచ్చేవారు; ప్రసాదం తీసుకొని నీటిలో కలుపుకొని త్రాగేవారు. ఈవిధంగా వారు తమ జీవితాన్ని పోషించుకుంటూ వచ్చారు. అలాంటి వ్యక్తులు ఇంకా ఎక్కువమంది తయారై ఈనాటి యువకులకు ఆదర్శాన్ని నిరూపించాలి. ఈనాటి యువకులది 'మంకీ మైండు'. మామూలు 'మంకీ మైండు' కాదు, అంతకంటే హీనమైనది! ఒక నిమిషంలో ఒకరీతిగా, మరొక నిమిషంలో మరొకరీతిగా మాట్లాడుతారు. నాలుకకు ఎముక లేదు; ఎట్లా త్రిప్పితే అట్లా తిరుగుతుంది కదా అని ఇష్టమొచ్చినట్లు మాట్లాడకూడదు. చెప్పిన మాటను చచ్చేంతవరకు, నాలుక పోయేంతవరకు నిలుపుకోవాలి. ఒకరు "స్వామీ! నాకు పళ్ళు ఊడి పోతున్నాయి. ఇంక జీవించి ఏమి ప్రయోజనం?" అన్నారు. నేను చెప్పాను – "పళ్ళు పోతున్నాయి గాని నాలుక పోవటం లేదు కదా!" పళ్ళు కఠినమైనవి. కాబట్టి అవి మొదలు పోతాయి. కాని మెత్తనైన నాలుక పోయేది కాదు. అది చివరివరకు మీ వెంటనే వస్తుంది. కాబట్టి నాలుకను పవిత్రంగా పెట్టుకోవాలి. వినయ విధేయతలతో మాట్లాడాలి. సత్యాన్ని పలకాలి. ధర్మంగా ప్రవర్తించాలి. భగవన్నామస్మరణ చేయాలి. పరులకు నామస్మరణను వినిపించాలి. అందుకోసమే భగవంతుడు మీకు నాలుకనిచ్చినది.

"నోటిని ఇచ్చినదెందుకొ తెలుసా? అన్నీ తినేటందులకా? కాదు, కాదు. ఆర్తావనుడౌ దేవదేవుని కీర్తనలు పాడేటందులకు. పొందుగ పాదము లిచ్చిన దెందుకు? సందులు, గొందులు తిరుగుటకా? అందుకు కాదు. నందివాహనుని మందిరమ్మున తిరుగుటకు." ఈవిధంగా ప్రతి అంగమును సార్థకం గావించుకోవాలి. దేహంతో సత్కర్మల నాచరించాలి. "శరీర మాద్యం ఖలు ధర్మసాధనం." ధర్మాచరణ నిమిత్తమే శరీరం వచ్చింది. కాబట్టి దీనిని పవిత్రమైన మార్గంలో ప్రవేశపెట్టి మీరు శాశ్వతమైన సత్కీర్తిని పొందాలని నేను ఆశిస్తున్నాను.

**(22-08-2001 ఉదయం సాయికుల్వంత్ సభామంటపంలో శ్రీవారు అనుగ్రహించిన దివ్య సందేశము)**

srisathyasai vahini